క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట భద్రత


ఎస్‌ఐ షెక్షావలి

శ్రీరంగరాజపురం: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జనం గుంపులుగా ఉండకూడదన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను ప్రభావితం చేసే విధంగా మద్యం, నగదు పంచితే కఠిన చర్యలు తప్పవన్నారు. సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్ మునెమ్మకు పరామర్శ

వడమాలపేట : వడమాలపేట సర్పంచ్ మునెమ్మను పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పరామర్శించారు. ఇటీవల సర్పంచ్ భర్త వెంకటాద్రి మృతిచెందాడు. విషయం తెలిసి మంత్రి సోదరులు కుమారస్వామి రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి ఇటీవలే వెళ్లి పరామర్శించారు. నేడు స్వయంగా మంత్రి హాజరై వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున అండగా నిలుస్తామని మునెమ్మకు మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ సదాశివయ్య, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్ రాజు, నాయకులు నందయ్య, జయరాం, పాపయ్య, ఆనందయ్య, యాదవేంద్రరెడ్డి, మునిశేఖర్, కిరణ్, ఉమాపతి, వేణు, చిన్నబ్బ, బాబు మేస్త్రీ, వెంకటేష్ పార్టీ శ్రేణులు పరామర్శించారు.

గాయపడిన మహిళా పోలీస్‌కు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

నగరి : వడమాలపేట టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన నగరి మండలం బుగ్గ అగ్రహారం సచివాలయ మహిళా పోలీస్ నవీనకు రాష్ట్ర మహిళా పోలీస్ అసోయేషన్ వారు ఆర్థికసాయం అందించారు. ఆదివారం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీనను కలిసినవారు ఆమె ఆరోగ్య క్షేమాలను విచారించారు. అసోసియేషన్ తరఫున పోగుచేసిన రూ.1.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత, జిల్లా కమిటీ అధ్యక్షురాలు శివగామి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు శైలజ, దివ్యారెడ్డి, మండల, మున్సిపల్ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సువర్ణపాలనకు వైఎస్సార్‌సీపీతో బీజం

- రాజకీయానికి రాజసం నేర్పిన నేత జగనన్న
- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో మంత్రి ఆర్‌కే రోజా


రామసముద్రంలో కేక్ కట్ చేస్తున్న మంత్రి రోజా


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి : ప్రతిపక్షాల గుండెల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా వణుకు పుట్టిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలోని మహానేత వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి నాయకులకు పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం అంటే ప్రజల కష్టాలు తీర్చే సువర్ణ పాలనకు బీజం పడిన రోజన్నారు. జగనన్న తన సత్తా ఏంటో ప్రతిపక్షాలకు రుజువు చేయడానికి నాంది పలికిన రోజని ఆమె తెలిపారు. రాజకీయానికే జగనన్న రాజసం నేర్పారని, 13వ వసంతంలోకి దిగ్విజయంగా రెపరెపలాడుతూ వెళ్తోందన్నారు. దీనికి కారణమైన జగనన్నకు సెల్యూట్ చేస్తున్నామని తెలిపారు. దొంగ కేసులు పెట్టి జైల్లో పెట్టినా, కత్తితో దాడి చేసినా, మాటల తూటాలతో బాధ పెట్టినా ఏమాత్రం వెనుకడుగు వేయక వాటిని అధిగమించి నేడు తిరుగులేని ముఖ్యమంత్రి అయ్యారంటే అది సామాన్యమైన విషయం కాదన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ..

జగనన్న పాలనా తీరును ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు నేడు ప్రధానమంత్రితో శభాష్ అంటున్నారంటే అలాంటి నేత ముఖ్యమంత్రి కావడం మన అదృష్టమని మంత్రి రోజా అన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు వస్తారని, వెళ్తారని జగనన్న చరిత్రలో నిలిచిపోయే ముఖ్యమంత్రి అన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయించారని, జీఎస్‌డీపీలో నంబర్ వన్‌గా చేశారని తెలిపారు. పారిశ్రామిక దిగ్గజాలే జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చామని ప్రకటించడం ఆయన సుపరిపాలనను తెలియజేస్తోందని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దేశంలోనే అతిపెద్ద నాలుగో పార్టీ అయిందంటే అది సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నాయిరం, ఢిల్లీ రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా చేనేత అనుబంధ విభాగం అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్, మండల సచివాలయ కన్వీనర్లు దయానిధి, హరి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగనన్న

వడమాలపేట : పేదల సంక్షేమమే పరమావధిగా, సుపరిపాలన అందిస్తూ పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ ఆవిర్భావం వేడుకలను మండలంలోని రామసముద్రం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు సరికొత్త భాష్యం చెప్పిన గొప్పనేత సీఎం జగనన్న అన్నారు.

పలువురికి మంత్రి పరామర్శ

రామసముద్రం గ్రామంలో పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేస్తున్న నాయకులు సదాశివయ్య, రామ్మూర్తి, నందయ్య, ఆనందయ్య, జయరాం ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ సదాశివయ్య, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సురేష్‌రాజు, నాయకులు నందయ్య, యాదవేంద్రరెడ్డి, మునిశేఖర్, శ్రీనివాసులు, కిరణ్, మునిబాబు, ఉమాపతి, వేణు, చిన్నబ్బ, బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణ మండపానికి సారెను తీసుకొస్తున్న ఉభయదారులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించి పరిమళ పుష్పాలు, ఆభరణాలతో స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తులను స్వామివారి కల్యాణ మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. ఉభయదారులను కల్యాణోత్సవానికి కంకణధారులను చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి పూజలు చేపట్టారు. అర్చకులు హోమం నిర్వహించారు. మంత్రోచ్చరణలతో శ్రీదేవి, భూదేవి మెడలో అర్చకులు మాంగళ్యధారణ క్రతువును పూర్తి చేశారు. భక్తులు కానుకలు సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


పాఠశాలలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

నగరి : దశాబ్దం కిందట పాఠశాల ఆవరణలో చేసిన అల్లరి పనులే నేడు తీపి అనుభూతులయ్యాయి. వారి హృదయాలు పాత జ్ఞాపకాలతో నిండాయి. పాఠశాలలో నాడు గురువులు బోధించిన పాఠాలు, ఆడుకున్న మైదానాలు చూస్తూ వారి మనస్సు ఆనందంతో నిండింది. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2010–11 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. వృత్తి, ఉద్యోగాల రీత్యా వారు ఎక్కడెక్కడో ఉంటున్నారు. అయితే నాడు వారు చదువుకున్న పాఠశాల నేడు కార్పొరేట్ స్థాయిలో మారి తరగతి గదులు, అందులోని కుర్చీలు అత్యాధునికంగా కనిపిస్తుండడం, మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, తాము తిరిగిన ఆవరణలన్నీ ఆధునీకరించడం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. తమకు విద్యాబుద్ధులు బోధించిన గురువులను సత్కరించారు. పాఠశాలకు బీరువాను వితరణగా అందించారు. దశాబ్దం తరువాత చదువుకున్న స్కూల్‌కు విచ్చేసి తమను సత్కరించిన విద్యార్థులను గురువులు ఆశీర్వదించారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

- రాస్ సేవలు ప్రశంసనీయం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా


మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా



గర్భిణులకు సీమంతం చేస్తున్న మంత్రి రోజా


సమావేశానికి హాజరైన మహిళలు

పుత్తూరు రూరల్: నేటి జగనన్న ప్రభుత్వం మహిళా సాధికారిత దిశగా పరుగులు పెడుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రాష్ట్రీయ సేవా సమితీ (రాస్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ మహిళలకు సామాజికంగా సముచిత స్థానం కల్పించడమే కాకుండా ఆర్థిక భరోసాను అందిస్తున్నారని తెలిపారు. లింగ వివక్షత చూపకుండా ప్రతి ఇంట్లో అబ్బాయిని, అమ్మాయిని సమానంగా పెంచాలని, అప్పుడే ఆ ఇంటి నుంచే మహిళా సాధికారిత మొదలవుతుందని వివరించారు. రాస్ సేవాసంస్థ కొన్ని వేలమంది మహిళలకు అండగా నిలబడి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఎంతగానో కృషిచేస్తోందని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు కుటుంబ క్రమశిక్షణ నేర్పిస్తూ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, ప్రాజెక్టు ఆఫీసర్లు తపోవని, రవి, బాలాజీరెడ్డి, వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, వార్డు కౌన్సిలర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

సర్పంచ్ ధనమ్మకు నివాళి


నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం : మండలంలోని డీకే మర్రిపల్లి సర్పంచ్ ధనమ్మ (72)అనారోగ్యంతో స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. సమాచారం అందుకున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆదివారం వారి స్వగృహం డీకే మర్రిపల్లిలో ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ధనమ్మ మరణం పార్టీకి తీరని లోటు అని, అతితక్కువ కాలంలో ప్రజలకు సేవ చేసి మన్ననలు పొందిన సర్పంచ్‌గా గుర్తింపు పొందారని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, జనార్దన్, విజయబాబు, మణి, కోటిరెడ్డి బాబు, మార్కండేయ, పార్టీ శ్రేణులు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు పూర్తి

పాలసముద్రం : మండలకేంద్రంలోని పాలసముద్రం ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లలో అవసరమైన సౌకర్యాలపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటర్లు ఫొటో ఐడీ కార్డు, ఓటు సీరియల్ నంబర్‌తో రావాలన్నారు. ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జయహో జనతా పోస్టర్ల విడుదల


జయహో జనతా పోస్టర్ విడుదల చేస్తున్న వ్యవస్థాపకులు

నగరి : జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు జయహో జనతా పేరిట చేయనున్న స్వచ్ఛంద సేవాకార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆదివారం స్థానిక కృష్ణా మినీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అభిమాన సంఘ సభ్యుల మీట్ అండ్ గ్రీట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'రా ఎన్టీఆర్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సాయిరూప్ నల్లూరి, దుర్గా ప్రసాద్ నల్లూరి జయహో జనతా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయహో జనతా స్వచ్ఛంద సేవాసంస్థలో 10 వేల మందిని సభ్యులుగా చేర్చడం వారి ద్వారా సేవా కార్యక్రమాలు, ప్రభుత్వానికి సంబంధించిన శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొనడం లాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సుపరిపాలన


కేక్ కట్ చేస్తున్న కుమారస్వామి రెడ్డి

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సుపరిపాలన సాగుతోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి అన్నారు. వైఎస్సార్‌సీపీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం అన్నూరు వద్ద సర్పంచ్ సుందర్‌రాజ్ ఆధ్వర్యంలో, కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి వద్ద కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీటీసీ సభ్యులు పొన్నుస్వామి, మురగయ్య, నాయకులు పాల్గొన్నారు.

నైతిక విలువల పునాదిపై వైఎస్సార్‌సీపీ

పుత్తూరు రూరల్: నైతిక విలువలతో కూడిన జనరంజక పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో పటిష్టంగా ఉందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో, విజయపురంలో వేర్వేరుగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు, విజయపురం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలకేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి కార్యక్రమంలో మండల కన్వీనర్ అనంతరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, కోఆప్షన్ సభ్యుడు అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా మహిళా కార్యదర్శి మేరి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సర్పంచ్ వసంతమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ విజేష్, నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలసముద్రం: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు


పెనుమూరులో..

పెనుమూరులో..

పెనుమురు (కార్వేటినగరం): స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సుభాషిణి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడే పెద్దల సభ ఎన్నిక సమరం


పోలింగ్ సామగ్రి అందిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్‌కు సిద్ధమైన నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ
- ఏర్పాట్లను పరిశీలించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ


పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డీఎస్పీ రవికుమార్

నగరి : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం జరగనుంది. పోలింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశారు. మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణలో వీడియో చిత్రీకరణ ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే కేసు నమోదు చేస్తారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ..

డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ప్రాంతాలకు పోలింగ్ సామగ్రిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పోలింగ్ కేంద్రాల వారీగా ఆదివారం పంపిణీ చేశారు. పంపిణీ నిమిత్తం డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తుతో సామగ్రిని, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేరవేశారు.

ఏర్పాట్ల పరిశీలన..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను నగరి ఆర్డీఓ ఎస్.సుజనతో కలిసి ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ పి.ప్రభాకర రెడ్డి పరిశీలించారు. ఎన్నికల కోసం నియమింపబడిన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు రూట్ ఆఫీసర్లు అంతా విధులకు సక్రమంగా హాజరయ్యారా ? లేదా? అనే అంశాలను పరిశీలించిన జెడ్పీ సీఈఓ, అనంతరం సిబ్బంది కొరతగా ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి తగిన చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సిబ్బంది తమకు అందజేసిన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్, ఫారాలు, బ్యాలెట్ పేపర్లు సరిగ్గా ఉన్నాయా? లేదా అని పరిశీలించుకున్న తరువాతే రూట్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇక ఎన్నికలు సజావుగా జరిగే విధంగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. డీఎస్పీ రవికుమార్ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి శిక్షణ అందించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..

మండలం	ఓటర్లు
నగరి	2,625
పుత్తూరు	2,838
విజయపురం	770
నింద్ర	657
వడమాలపేట	824
మొత్తం	7,714